# 27. ప్రతిబింబాలు

బైటి వర్షానికి భయపడి స్నేహితులం నలుగురమూ కాఫీ హోటల్లో ఒక మూల కూర్చొని, సిగరెట్లు ఊదుతూ కాలాన్ని చంపుతున్నాం. వొచ్చే పొయ్యే జనం బహు తక్కువగా ఉండటం వల్ల, హోటల్ వాడు కూడా మా ఉనికికి కష్టపడు తూన్నట్లు కనిపించ లేదు.

పెద్దగా మాట్లాడుతూ, నవ్వుతూ యీదరగాలి చేసే హోనిని కూడా మరిచిపోయి, క్రమ సంభాషణ లేకుండా ఉన్న సమయంలో– హఠాత్తుగా సంభాషణ ఆగి పోయింది. కేవలం కాలాన్ని గడిపే సంభాషణ అయినా, ఆ సంభాషణలో కుతూహలం లేక కాదు... ఏదో వొక దృశ్యం మా అందరి నోళ్ళూ ఒక్కసారిగానే కట్టేసి వుంటుంది. ఒక్కసారిగా వాతావరణంలో జరిగిన యీ మార్పు, మమ్మ్ము మూగపరచ గలిగిన యీ దృశ్యం ఏమిటో వెంటనే గ్రహించటం కాస్త కష్టమయింది.

ఓవర్ కోటును విడుస్తూ– మా టేబిల్ దగ్గరికే వొచ్చి కూర్చున్నాడు– దాసు. దాసు పాత స్నేహితుడే అయినా మామూలు వ్యక్తి మాత్రం కాడు. అందుకనే ఎవరో నూతన వ్యక్తి హఠాత్తుగా వొచ్చినంత పనయింది.

వాన నీళ్ళు తుడుచుకొని దాసు ముఖం పైకెత్తాడు. ఏదో కొంప మునిగేటంత కోపంతో అతని ముఖం నిప్పు కణమల్లే వుంది. ఆ జ్వాలను బైటి కుంభవర్షం తగ్గించిన సూచన లేమీ కనిపించటం లేదు. ఎంతో ఉద్రేకంతో వొణికి పోతున్నాడు: గొప్ప విశేషమేదో జరిగి వుంటుందని మాలో ప్రతి ఒక్కరికీ తెలుసు. కాని 'ఏమిటి?' అని ఎవరూ అడగలేదు. ఎందుకంటే ఆ స్థితిలో ఉన్నవాణ్ణి బలవంతపెట్టి ఏమీ చెప్పించుకో నక్కర్లేదు. బలవంతపెట్టి వాడి నోరు కట్టెయ్యగలగటం నిజంగా అసాధ్యమే!

దాసు మా అందర్నీ ఒక్కసారి తేరిపార జూశాడు. నలుగురం ఒకే చోట గుమికూడి ఉండటం అతని కొకరకం తృప్తిని ప్రసాదించినట్టే వుంది. ఎనిమిది చెవులు ఒకేసారి తన కథను వినేందుకు సిద్ధంగా ఉండటం తన అదృష్టమే నన్నట్టు సన్నగా నవ్వాడు. ఇలాటి ప్రదేశం కోసమే వీధులన్నీ తిరుగుతూ, వెదికి వేసారి, నిరాశ చేసుకున్న సమయంలో చివరకు యీ రహస్య స్థలాన్ని కనుక్కో గలిగిన తన ఉత్సాహాన్ని సూచిస్తూ, అలసట తీర్చుకున్నట్టు ఒక పెద్ద నిట్టూర్పు విడిచాడు. ఇక భయం లేదన్నట్టు కుర్చీలో - చలికి కాబోలు - కాస్త ముడుచుకున్నాడు. ఉద్రేకాన్ని తగ్గించుకొని మా అందరికీ ఒక వరస కాఫీ ఆర్డర్ చేశాడు. ఇంతకు ముందే కాఫీ తాగామనీ, ఇప్పటికిప్పుడే కాఫీ అవసరం లేదనీ చెప్పేందుకు మాలో ఎవరికీ ధైర్యం లేకపోయింది.

ఏ దుర్ఘటన వినేందుకు ముందు యీ కాఫీ లంచాన్ని మౌనంతో అంగీక రిస్తున్నామో ఎవరికీ అర్థం కావటం లేదు.

కాఫీ పూర్తయాక, సిగరెట్ డబ్బా కూడా మా ముందు పెట్టాడు. ఇంకా చెప్పటం మొదలు పెట్టడేమా అనిపిస్తోంది. వొచ్చినప్పటి ఉద్రేకాన్ని ఎందుకు తగ్గించుకున్నాడో, ఎలా తగ్గించుకో గలిగాడో నాకు మాత్రం అంతుపట్టడం లేదు.

ఇంకోసారి ఊపిరి బాగా పీల్చి వొదిలి గొంతు సరిచేసుకుంటూ, పూర్వపు ఉద్రేకాన్ని ముఖంలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నించాడు.

“చూశారా– ఆ వెధవ ఎంత పని చేశాడో?”

“ఎవరూ?” అన్నాడు శాస్త్రి.

“వాడే... ఆ శ్రీరాములు గాడు!”

“ఏం చేశాడూ?” అన్నాడు శాస్త్రి. బుర్రకథలో ఒకపక్కనున్నవాడు ‘తందానతానా’ అన్నట్టు, చెప్పేవాడికి వూతగా వుండేందుకు మొదటినుంచి శాస్త్రి బాగా అలవాటు పడివున్నాడు. ఆ శ్రమను శాస్త్రి తీసుకుంటూండగా మా అందరికీ ఎంతో ‘రిలీఫ్’ ఇచ్చినట్టుంది.

“ఆ పిచ్చయ్యతో ఏమేమో వాగాడట! ఎగ్జామినర్లకు లంచం పెట్టి, నేను బి.ఎ.లో మార్కులు సంపాయించానట: మా అన్నయ్య స్టేట్ కౌన్సిల్‌కు నిలబడి చావుతప్పి కన్ను లొట్టబోయి గెలవటం– పోస్టు జవాన్ల చలవేనట!”

“అంటే?”

“ఊళ్ళో లేకుండా ప్రస్తుతం దూర ప్రాంతాల్లో వున్న వాళ్ళూ, లోగడ ఎప్పుడో పరలోకాలకు జేరుకున్నవాళ్ల పేరున వచ్చే కవర్లను– పోస్టు జవాన్లకు లంచమిచ్చి సంపాయించి, ఆ బాలట్ కాగితాల మీద ఫోర్జరీలు చేసి ఓట్లు సంపాయించి పెట్టానట–”

"ఇంకా ఏమన్నాడూ?"

"నేనసలు ఒక కట్ట పుస్తకాలు చంకన పెట్టుకొని రోడ్ల మీద బేవార్సుగా తిరుగుతూ – లోకుల చందాల మీదా, విరాళాల మీదా పెద్ద ఎత్తు జీవితాన్ని గడిపేందుకు ప్రయత్నిస్తూ– సాహిత్యంలో సాధించలేని స్థానాన్ని గూర్చి కలలు కంటున్నానట: చూడు... వెధవ... ఏ విధంగా దుష్ప్రచారం చేస్తున్నాడో?"

"కలిసి తిరిగినన్నాళ్లూ మీరిద్దరూ ఏక శరీరులుగా తిరిగారు. ఇద్దరి మధ్యా కాస్త అభిప్రాయ భేదాలు వొచ్చినందుకు – ఒక స్నేహితుడి గౌరవాన్ని కాపాడటంపోయి, ఇలా నిన్ను అగౌరవించాడంటే నిజంగా వాడు ద్రోహి అనే చెప్పాలి..."

ఈ మాటలు దాసును రెట్టించినవి. అర్ధ రూపాయి ముఖాన్ని రూపాయిదాకా పెంచాడు.

"చూడు భాయీ! వాడితో కలిసి తిరగటం మానేసి ఆరు నెల్లయింది కదా: వాణ్ని గూర్చి ఒక్క మాటన్నా ఎవరితోనన్నా అన్నానా? వాడి రహస్యాలు నాకు యెన్నో తెలుసు. అవి చెప్తే మీలో ఎవ్వరూ వాడితో మాట్లాడరు కూడాను."

దాసు మనసులోని విషయా లేమిటే మాకు తెలియనందు వల్ల మే మెవ్వరమూ జవాబు చెప్ప లేదు. అవేమిటో చెప్పమని అడగటం చాలా అసభ్యంగా వుంటుందని ఊరుకున్నాం.

'వీళ్లు మనను అడగరు' అని దాసు క్షణంలో తేల్చు కొన్నాడు. అందుకని తన గ్రామఫోను ప్లేటును అయాచితంగా వెంటనే ముందుకు సాగించి మమ్మ రక్షించాడు.

"వీడి మొహం! వీడు ప్రతిదానికీ చందాలు వేయటమే కాని ఒక్కటి ఇచ్చాడూ? కోర్టులో కేసు గెలిపిస్తానని వాళ్ళ ఊరివాళ్ళ దగ్గర నాలుగువేలు తీసుకొని, అందులో వెయ్యి మేజిస్ట్రేట్‌కు ఇస్తానని వాగ్దానం చేసి, తీరా కేసు గెలిచాక వంద మాత్రం ముట్టజెప్పాడు. ఇంతకన్న అన్యాయం వుందీ? ఇలాటి ఉదాహరణలు సవాలక్ష వున్నయ్. ...వీడి ఐశ్వర్యం ఎవడిక్కావాలీ? వీడు మా పార్టీకి ఫండు ఇస్తే ఎంత? ఇవ్వకపోతే ఎంత? భార్య ఆస్తి వొస్తే కారుకొన్నాడు కాని..."

యీ కొత్త విషయాల్ని జీర్ణించుకునేందుకు అందరూ అవస్థ పడుతున్నారు. కాని దాసు మాత్రం వ్యవధి ఇవ్వ లేదు.

అన్నాడు: "పొద్దున్నే పిచ్చయ్య మా ఇంటికి వొచ్చి, యీ సంగతులు చెప్పింది మొదలూ వాడికోసం వెతుకుతూనే వున్నాను. ఎక్కడ కనిపిస్తే అక్కడ చెప్పు తీసుకొని బజాయిద్దామనే తిరుగుతున్నాను ... ఏలూరు వెళ్ళాట్ట ... ఎల్లుండి కాని రాడుట... రాగానే మీ అందరి ఎదుటా వాడి నెత్తి బొచ్చు రాలగొట్టనూ?... వెధవ!"

ఆ ఉద్రేకంలో తను బొచ్చు, ఎంత తెలివిగా, విగ్గులాగు ఊడి వొచ్చేట్టు ఎలా కొడతాడో రిహార్సల్స్ మాకు చూపేందుకు కాబోలు- చెయ్యి పైదాకా ఎత్తాడు... బొచ్చేమీ లేని టేబిల్‌మీద యీ రంగాన్ని ఉద్ధరించేందుకు: వాడు చెయ్యబొయ్యే పొరపాటుకు హోటల్ వాడు మెడ పట్టుకుని బురద బురదగా వున్న రోడ్డు మీదకు దొర్లిస్తాడని చెప్పే సావకాశం లేక, నాలుక కొరకటంతో సూచించాను. చప్పున గ్రహించి దాసు చేతి విసురును చాలా భాగం తగ్గించ గలిగాడు. పావు శతాబ్దపు జీవితంలోనూ దాసు చేసిన తెలివైన పనుల్లో ఇది మూడోది.

"వాడి పని పట్టాల్సిందే... వొదిలి పెడతానా?" అన్నాడు, దొరికిన యీ వొక్క శ్రోతనూ వొదిలేందుకు ఇష్టపడక.

"అది తరువాత మాట... కాని జరిగిన విషయాన్ని జాగ్రత్తగా ఆలోచించు. తొందరపడి ఉద్రేకంలో ఏమన్నా చేసి, తరువాత పశ్చాత్తాప పడటం..."

ఇక చేసేందు కేమీ లేక దాసు కూలబడ్డాడు. బైటి వానతో పాటే ఈ తుఫాను కూడా ఆగింది. ఎవరూ ఏమీ మాట్లాడేందుకు సాహసించ లేదు. ఐనా మాట్లాడేది ఏముందీ? తరువాత చెయ్యాల్సిందేదో దాసు చేస్తాడాయె; అంతవరకూ ఆగటం వొక్కటే మే మెవరిమైనా చెయ్యగలిగింది.

అసంతృప్తితో యీ ప్రదేశంలో మరి వుండలేక, ఒక్కరొక్కరే లేచి, తమకు అర్జంటు పనులు ఉన్నాయని జారుకోవటం మొదలుపెట్టారు.

## 2

"వెళ్దామా?" అన్నాడు దాసు.

"కూర్చో!" అన్నాను.

"ఏమిటీ- వాడికి నేను భయపడతా ననుకున్నావా?"

"ఒకళ్ళను చూసి ఒకళ్లు భయపడటం మాట అటుంచు... కాని నిజా నిజాల్ని పరిశీలించాలిగా! నీ కీమాట చెప్పింది పిచ్చయ్య. పిచ్చయ్యతో శ్రీరాములు యీ మాటలన్నీ అన్నాడని నిశ్చయంగా ఎలా చెప్పగలం?"

"ఆ సంగతి పిచ్చయ్యే చెప్తున్నాడాయె!"

"నీతో చాటుగా చెప్పాడే కాని, రేపు రుజువుకు వొస్తే చల్లగా జారుకుంటే నువ్వే మౌతావూ? అదీకాక పిచ్చయ్యకూ నీకూ అసలు పడదు. మీ ఇద్దరి మధ్యా జరిగిన వాగ్యుద్ధాలు చేతులు కలపటం దాకా చాలాసార్లు వెళ్ళినయ్ కదా! యీ మధ్యలో ఎప్పుడూ నిన్నొక మనిషిగా కూడా చూడని పిచ్చయ్య, జీతం బత్తెం లేకుండా ఇలాటి మాటల్ని నీకు జేరేశాడంటే అర్థముందా?"

"అబద్ధం చెప్పాల్సిన ఖర్మం వాడి కేముందీ?"

"ఏమో! శ్రీరాములు మీద పిచ్చయ్యకుగల ద్వేషమే కారణం కావొచ్చు నేమో కాని, నీ మీద వాత్సల్యం మాత్రం కాదు-"

"ఎందుకనీ?"

"మీ ఇద్దరికీ పడదు కనుక."

"దీనివల్ల పిచ్చయ్యకు కలిగే లాభం ఏముందీ?"

"మీ ఇద్దరి మధ్యా విరోధాన్ని బాగా లేపి, నీ వీపు చెడితే కాపు కూడా వెయ్యకుండానే, పైనుంచి వినోదాన్నిచూసి ఆనందించటం కావొచ్చు గదా!"

"ఇది అసంభవం!"

వాదనకు తావు ఇవ్వని దాసును చూస్తే నవ్వొచ్చింది. కాని నవ్వితే సందర్భశుద్ధి చెడుతుందని నిలవదొక్కుకున్నాను.

"పోనీ శ్రీరాములు పిచ్చయ్యతో ఆ మాటలన్నీ అన్నాడనే అనుకుందాం-"

ఆ మాటల్తో దాసు ముఖం వికసించి "అట్లారా - చెప్పు" అన్నాడు దాసు ఉత్సాహంగా.

"పిచ్చయ్యే కనక నీకు స్నేహితుడైతే ఆ మాటల్ని కడుపులోనే దాచుకునే వాడు-"

"నా మేలు కోరి-"

"ఓరి వెధవా! పిచ్చయ్య చేరవేసిన మాటల వల్ల నీకు కలిగింది బాధకాని, ఆనందం కాదు. ఆ మాటలు విన్నప్పటి నుంచీ నువ్వు లోలోపల కుమిలి కుమిలి, ఇంతకు ముందే అగ్ని పర్వతంలాగు వృథాగా ఇక్కడ బద్దలయ్యావ్. నీ మనసుకు కష్టాన్ని కలిగించే వాడు శత్రువో మిత్రుడో కూడా తెలుసుకోలేని నీ బోడి బి.ఏ విజ్ఞానం ఎందుకూ?"

దాసు సగం చచ్చి "అది కాదు. ఆ శ్రీరాములికి నన్ను గూర్చి నా వెనుక మాట్లాడాల్సిన అవసరం ఏముందీ? పిచ్చయ్య గొడవ వొదిలెయ్..." అన్నాడు.

"పోనీ అలాగే వాగా డనుకుందాం. పిచ్చయ్య నీకు విరోధి కనుక, అతను ఆ మాటలకు ఆనందిస్తాడని నిన్ను నిందిస్తే నిందించవచ్చు. కాని వాడు వాగిన మాటల్లో అబద్ధం ఏముందీ?"

"అంటే?"

"మొదటిది- నువ్వు మన ఎం.ఎల్.ఏ.ల దగ్గర్నుంచి రికమన్‌డేషన్లు తీసుకు వెళ్ళి లంచాలిచ్చి బి.ఏ. పరీక్ష నెగ్గావ్. ఆ సంగతి నాకు బాగా తెలుసు కనుక

దబాయించ లేవు. రెండోది మీ అన్నయ్య స్టేట్ కౌన్సిల్ ఎలక్షన్స్‌లో నా పలుకుబడిని కూడా పోస్టాఫీసులో ఉపయోగించుకున్నావ్ కదా! ఇక..."

దాసు మొదట్లో కుంచించుకు పోయినా, కోపంతో లేచి నన్ను మాట్లాడ నివ్వకుండా "నువ్వు వాడి పార్టీలో జేరావ్. ఆ విధంగా నన్ను గూర్చి పిచ్చయ్య దగ్గర వాగినవాణ్ణి వెనకేసుకొని వొస్తున్నావ్. ఇంతకన్న–" మరి మాటలు రాక ఆగాడు.

"అది కాదోయ్! నేను ఎవరి పక్షాన లేకుండా బైటనుంచే ఈ విషయాన్ని బాగా పరిశీలిస్తున్నాను. జాగ్రత్తగా ఆలోచించు. ఇందులో అబద్ధం వుందా?"

"లేకపోతే మాత్రం మాంసం తింటే బొమికలు మెళ్ళోవేసుకొని తిరగాలా యేం?"

"అట్లారా... నువ్వీ పనులు చేసినా, శ్రీరాములు పిచ్చయ్యతో అన్న మాటలు సత్యమే అయినా, ఇందులో పిచ్చయ్య ఉద్దేశం ఏమిటో తెలుసా?" అన్నాను.

"పిచ్చయ్య గొడవ దేనికీ?"

"అట్లా అనకు. ఆ పిచ్చయ్యే లేకుంటే అసలు గొడవే లేదు. నిన్ను రెచ్చగొట్టేందుకే తెల్లార కుండానే మీ ఇంటికి వొచ్చి వాగాడు. ఇక్కడికన్న ఎక్కువగా ఎగిరిపడి, పిచ్చయ్య దగ్గర నోటి కొచ్చిందల్లా వాగి వుంటావ్–"

"ఏం వాగుతే?"

"ఆ మాటల్ని మళ్ళీ పిచ్చయ్య జేరేస్తాడు. ఇంకోడి మాటల్ని నీకు జేరెయ్యటం పనిగా పెట్టుకున్నవాడు, నీ మాటల్ని వాడికి మాత్రం జేరెయ్యడూ?"

"పిచ్చయ్య అట్లా చెయ్యడు–"

"ఆ విధంగానే శ్రీరాములు కూడా పొరబడి వుంటాడు. మీ ఇద్దరి మధ్యా విరోధాన్ని రగల్చటమే పిచ్చయ్య లక్ష్యం. అది తీరుతేనే కాని వాడికి నిద్దర పట్టదు– ఇది యథార్థం–"

"ఐతే?"

"ఈ సమయంలో నువ్వు అణగారటాన్ని పిచ్చయ్య కోరుతూ యీ పన్నాగం పన్నాడు. నువ్వు తెలివిగా ఒక పనిచెయ్. మాట్లాడకుండా ఊరుకున్నావా అటు పిచ్చయ్య ఛస్తాడు. ఒకవేళ శ్రీరాములు యీ మాటలు నీకు జేరేందుకే ఇదో విధానాన్ని అవలంబించి ఉంటే – అప్పుడు ఇద్దరూ ఛస్తారు. ఎందుకంటే ఇద్దరి మాటలకూ విలువ లేకుండా పోతుంది కనుక!"

"ఇంతకూ నీ సలహా ఏమీ చాతకాని అసమర్థుడులాగు ఊరుకోమని. అంతేగదూ?"

"అందులోనే ఉంది తమాషా!"

"ఐతే... శ్రీరాములు చేసిన పని మంచిదనా నీ వాదన?"

"కాదు... వాడు పాడు పనే చేశాడు. స్నేహితుడి గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యతను మరిచిపొయ్యాడు. అనవసర విషయాన్ని పాతర తవ్వాడు-"

"మరి అలాటి వాణ్ణి-"

"వాడిది తప్పే కాని..."

వాదనను భరించ లేక "కానీ లేదు, అర్ధణా లేదు. తప్పు చేసిన వాణ్ణి శిక్షించాల్సిందే-" అన్నాడు.

"సరే కాని - వాడి నీచత్వాన్ని ఒప్పుకున్నాను. మరి నీ నీచత్వం సంగతేమిటి?"

"నేనా? నేనేం చేశానూ?" అన్నాడు తనకు తెలియకుండానే ఏదో అపనింద హఠాత్తుగా మీదపడ్డట్టు.

"శ్రీరాములు చేసిన పని అక్షరాలా నిజమే ఐతే, ఒక విధంగా వాణ్ణి క్షమించవొచ్చు. మనకు తెలియకుండా మన వెనుక లక్షమంది లక్ష రకాలుగా మాట్లాడటంలో అసహజ మేమీ లేదు. నీ భార్యే నిన్ను గూర్చి తన అసలు అభిప్రాయాన్ని ఇతరుల దగ్గర వాగుతుంది. దాన్నెవ్వరూ అనలేరు... పోతే శ్రీరాములు అన్నది వొక్క పిచ్చయ్యతో. కాని నువ్వు మాత్రం ఏమంత పెద్దమనిషితనాన్ని రుజూ చేసుకో గలిగావ్? శ్రీరాములు చేసిన పనినే చేసి-"

"నేనేం చేశానూ? నేను ఎవరితోనూ వాణ్ణి గూర్చి నీచంగా మాట్లాడలేదే?"

"ఇంతకు ముందు మా నలుగురి ముందూ వాగనే వాగితివి. ఒకటి - వాడి చందాల ఎగవేత... రెండు మేజస్ట్రేట్‌కు లంచం పెడతానని డబ్బు గుంజటం..."

"మీరు స్నేహితులు-"

"ఐతే మాత్రం? ఆ విధంగా అపోహ పడే, శ్రీరాములు పిచ్చయ్యతో అని వుంటాడు. పిచ్చయ్యలాగే మా నలుగురిలో ఎవరో వొకరు స్వంత ఖర్చుల మీద ఏలూరు వెళ్ళయినా సరే శ్రీరాములుకు నువ్వన్న మాటలు ఊదవొచ్చు. ఇదంతా వినోదాన్ని మామా స్వంత శరీరాలమీద, మామా స్వంత ఖర్చుల మీద చూపి ఆనందించేందుకు... శ్రీరాములు అన్న మాటల్ని నువ్వు రుజూ చేయవలసి వొస్తే, పిచ్చయ్య ఒక్కడే నీకు గతి. ఆవేళకు వాడూ ఎదురు తిరిగితే? రోడ్డు మీద ఎవ్వరూ ఉమ్మెయ్యరు. ఒక వేళ పిచ్చయ్య కాలఖర్మవశాత్తూ నిలబడినా, శ్రీరాములు 'నేను అనలేదు' అని దబాయిస్తే- అది తేలని విషయం. నువ్వన్న మాటల్ని శ్రీరాములు రుజూ చేయవలసివొస్తే, ఇక్కడున్న నలుగురిలో ఏ ఒక్కరి సహాయమైనా సరిపోతుంది. శ్రీరాములు ఒక్కడితో చెప్పి సంపాయించిన నీచత్వాన్ని, నువ్వు నలుగురితో చెప్పి నాలుగు రెట్లుగా మీద వేసుకున్నావు-" అన్నాను.

దాసు నీరైపోయాడు. వాడికేమీ తోచక, రెండు గుటకలు మింగి "ఐతే నువ్వు కూడా శ్రీరాములికే సాక్ష్యం చెప్తావా?" అన్నాడు.

"న్యాయంకావాల్సి వొస్తే ఎందుకు చెప్పనూ? నేనేమన్నా అబద్ధమాడుతున్నానా? నువ్వీ మాటలన్నీ అననే అంటివి. నిజం చెప్పేందుకు నాకేం భయం?"

వాడు దాదాపు కళ్ళ నీళ్ళు పెట్టాడు. మరి గత్యంతరం లేక "ఐతే నన్నేం చెయ్యమంటావ్?" అన్నాడు.

"మాట్లాడకుండా వూరుకో. వాణ్ని నువ్వూ, నిన్ను వాడూ యీ విధంగా కడుక్కోవటంవల్ల ఇద్దరికీ హానే కలుగుతుంది. ఎవరితోవను వాళ్లుపోతే సరిపోతుంది. మధ్య చెవులు కొరికేవాళ్ళ మాటల్ని నమ్మి మోసపోవద్దు - తెలిసిందా?"

"నిజమే- నిజమే! ఇందాక పాడు ఉద్రేకం నాచేత అవాకులూ చెవాకులూ వాగించింది... వాళ్ళందరి ముందూ శ్రీరాముల్ని తంతానని ప్రతిజ్ఞ పట్టాను కదా ఖర్మం... ఎట్లా?"

"ప్రతిజ్ఞలు చెల్లించేందుకు నువ్వేమీ అర్జునుడివీ, భీముడివీ కాదు. శ్రీరాములు నెత్తి బొచ్చును చెప్పుతో రాలగొడతా నన్నావ్...ముందు వాళ్లను ఆ చెప్పులు కొనుక్కునేందుకు చందాలు వెయ్యమను- అప్పుడు వాళ్లే జారుకుంటారు-"

"అంతేలే! మంచి ఉపాయం చెప్పావ్."

దాసు అప్పటికి పూర్తిగా కుంగిపొయ్యాడు. ఇకలేచి బైటికివెళ్ళే శక్తికూడా లేనట్టు నీరసంగా నిట్టూర్చాడు. కాస్త ఓపిక పట్టించేందుకని ఇంకో వరస కాఫీ ఆర్డర్ చేశాను.